సాక్షి నాగర్‌కర్నూల్

ఆదివారం । 26 । నవంబర్ । 2023



కురుమూర్తి వాస.. గోవిందా

అమ్మాపురంలో వెలసిన కురుమూర్తిస్వామి జాతర వైభవంగా కొనసాగుతుంది.

వివరాలు 6లో ▸



ముగిసిన క్రీడా పోటీలు

పాలమూరులో కొనసాగుతున్న ఉమ్మడి జిల్లా పాలిటెక్నిక్ క్రీడలు ముగిశాయి.

వివరాలు 6లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.3 /19.2

ఉదయం, సాయంత్రం చలిగాలులు ఎక్కువగా వీస్తాయి. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

న్యాయ సేవలపై అవగాహన పెంచుకోవాలి



కొల్లాపూర్: న్యాయ సేవలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కొల్లాపూర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తులు ఆర్‌వీఎస్‌ఎస్ మిథున్‌తేజ, జ్యోత్స్న గుంటి అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్సీ గురుకుల విద్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ సదస్సులో న్యాయమూర్తులు మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులను దుర్వినియోగం చేస్తూ.. ఇతరులకు ఇబ్బందులు కలిగించకూడదన్నారు. హక్కుల ఉల్లంఘన జరిగితే న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చన్నారు. న్యాయ సేవల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జ్యోత్స్న, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వసంతరెడ్డి, న్యాయవాదులు భాస్కర్‌రెడ్డి, నిరంజన్, ముబీన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఖోఖో జట్టు ఎంపికలు

కందనూలు: రాష్ట్రస్థాయి జూనియర్స్ ఖోఖో చాంపియన్‌షిప్ నాగర్‌కర్నూల్ జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో జిల్లా జట్టు కోసం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ నిరంజన్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు పాఠశాల బోనోఫైడ్, ఎస్సెస్సీ, ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో సోమవారం ఉదయం 9 గంటలకు జెడ్పీ మైదానంలో రిపోర్ట్ చేయాలని కోరారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్లు 94934 50450, 98581 33052లను సంప్రదించాలని సూచించారు.

రూ.1.20 లక్షల విలువ గల మద్యం సీజ్

నాగర్‌కర్నూల్ క్రైం: ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రూ.1.20 లక్షల విలువ గల మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన జిల్లాకేంద్రంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు సమాచారం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని సవేరా బార్ నుంచి అక్రమంగా 10 కాటన్ల మద్యాన్ని ఆటోలో తీసుకువెళ్తుండగా సమాచారం అందుకున్న ఎక్సైజ్‌శాఖ అధికారులు దాడిచేసి ఆటోలో ఉన్న మద్యాన్ని స్వాధీనం చేసుకుని స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించి మద్యాన్ని లేబుళ్లను స్కాన్ చేయడంతో సవేరా బార్‌కు చెందిన మద్యంగా గుర్తించి బార్‌ను సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ వెల్లడించారు.





కొల్లాపూర్ బహిరంగసభకు హాజరైన ప్రజలు

కొల్లాపూర్ సకల జనుల విజయ సంకల్పసభలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

- కమలంతోనే సమస్యలన్నీ పరిష్కారం
- వాల్మీకి బోయలు, మాదాసి కురువలకు న్యాయం
- ఎస్సీ వర్గీకరణకు త్వరలోనే ముగింపు పలుకుతాం
- 18 నెలల్లో జాతీయ రహదారి, సోమశిల వంతెన పూర్తి

శ్రీశైలం నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పిస్తాం



కేంద్ర హోంమంత్రి అమిత్ షాను పూలమాలతో సత్కరిస్తున్న బీజేపీ అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావు

కొల్లాపూర్: 'కమలాన్ని గెలిపించండి.. మీ సమస్యలన్నీ పరిష్కరిస్తాం.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే అవినీతికి, మైనార్టీలకు, ఒక అవినీతి కుటుంబానికి వేసినట్లే' అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. శనివారం కొల్లాపూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన సకల జనుల విజయ సంకల్పసభకు అమిత్‌షా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శ్రీరంగాపూర్ రంగనాయకస్వామి, సింగోటం లక్ష్మీనరసింహస్వామి, మియాపూర్ సత్యమ్మ దేవత, నాయినోనిపల్లి మైసమ్మ దేవతకు నమస్కారం అంటూ తన ప్రసంగాన్ని మొదలుపెట్టారు. శ్రీశైలం నిర్వాసితులకు కేసీఆర్ ఏమీ చేయలేదని, బీజేపీని గెలిపిస్తే కచ్చితంగా వారికి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. వెల్టూరు– గొందిమల్ల ప్రాజెక్టును పూర్తిచేస్తామని, మామిడి ప్రాసెసింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, కొల్లాపూర్ మామిడిని యూరప్ దేశాలకు ఎగుమతి చేస్తామని పేర్కొన్నారు. అలాగే వాల్మీకి బోయలు, మాదాసి కురువల డిమాండ్లు నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ గెలిస్తే బీసీ అభ్యర్థి ముఖ్యమంత్రి అవుతారని, వెనకబడిన వర్గాల ప్రజల సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని వెల్లడించారు. ఎస్సీ రిజర్వేషన్ల వల్ల మాదిగ సమాజానికి మేలు జరుగుతుందని, త్వరలోనే ఎస్సీ వర్గీకరణ చేపట్టి.. ఆ సమస్యకు ముగింపు పలుకుతాం ప్రకటించారు. రూ.2,400 కోట్లతో చేపట్టిన జాతీయ రహదారి, సోమశిల వంతెన 18 నెలలో పూర్తి చేస్తామని వివరించారు. కొల్లాపూర్ యువత గురించి కేసీఆర్ పట్టించుకోదని, బీజేపీ వస్తేనే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. కొల్లాపూర్‌లో కమలం గుర్తుకు ఓటేసి బీజేపీ అభ్యర్థి సుధాకర్‌రావును గెలిపించాలని ఓటర్లను కోరారు.

జంగ్ తెలంగాణ

కొల్లాపూర్‌ను నంబర్‌వన్ చేస్తా..

ఇద్దరు తోడుదొంగలు.. ఒకరికొకరు తోడ్పాటు అందించుకుంటారు. మంది ముందు నాటకాలు ఆడతారు.. ఇద్దరిది మొన్నటి వరకు ఒకటే పార్టీ.. అధికారంలోకి ఏ పార్టీ వస్తే దానిలోకి ఇద్దరూ పోతారు అంటూ కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి కృష్ణారావు, బీఆర్‌ఎస్ అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డిలపై బీజేపీ అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావు విమర్శించారు. జాతీయ రహదారి, సోమశిల వంతెన బీజేపీ ద్వారానే సాధ్యమైందని, ఇందుకు కేంద్రానికి కొల్లాపూర్ రుణపడి ఉంటుందన్నారు. ఒక్కసారి బీజేపీకి కొల్లాపూర్ ప్రజలు అవకాశం ఇస్తే అలంపూర్ నుంచి కొల్లాపూర్ మీదుగా దేవరకొండ వరకు జాతీయ రహదారి మంజూరు చేయిస్తానని, కొల్లాపూర్‌కు రైల్వేలైన్ తీసుకొస్తానని, ఇండస్ట్రీయల్ పార్కు తెస్తే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ఇవన్నీ బీజేపీతోనే సాధ్యమవుతాయన్నారు. నీతిగా, నిజాయితీగా పనిచేస్తానని, తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని సుధాకర్‌రావు కోరారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, శ్రీనివాస్‌యాదవ్, శేఖర్‌గౌడ్, జలాల్ శివుడు, అక్కల రామన్‌గౌడ్, రోజారమణి, సింగోటం రామన్న, మూలె భరత్‌చంద్ర, అన్వేష్, గంగం మల్లేష్‌యాదవ్, జనసేన నియోజకవర్గ అధ్యక్షుడు సాంబశివుడు పాల్గొని పాల్గొన్నారు.

2,619 పోస్టల్ బ్యాలెట్ల వినియోగం

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్/ నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లావ్యాప్తంగా 2,619 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఉదయ్‌కుమార్ అన్నారు. 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, వికలాంగులు ఆయా నియోజకవర్గాల్లో పోస్టల్ బ్యాలెట్ వినియోగంలో భాగంగా శనివారం వరకు నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో 14 మంది వృద్ధులు, 19 మంది వికలాంగులు, అత్యవసర సేవలకు సంబంధించి 7, అచ్చంపేటలో 71 మంది వృద్ధులు, 51 మంది వికలాంగులు, అత్యవసర సేవలకు సంబంధించి 16, కొల్లాపూర్‌లో 26 మంది వృద్ధులు, 36 మంది వికలాంగులు, అత్యవసర సేవలకు సంబంధించి 62 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారన్నారు. జిల్లాలో మొత్తం 300 మంది హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోగా శనివారం వరకు మొత్తం 240 మంది ఓటుహక్కు వినియోగించుకున్నట్లు చెప్పారు. అలాగే ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది నాగర్‌కర్నూల్ పరిధిలో 650, అచ్చంపేటలో 827, కొల్లాపూర్‌లో 465 మంది ఓటుహక్కును వినియోగించుకోగా.. జిల్లాలోని ఎన్నికల సిబ్బంది రాష్ట్రంలోని ఇతర జిల్లాల నియోజకవర్గాల్లో ఓటు హక్కు కలిగి ఉన్న ఎన్నికల సిబ్బంది 437 మంది ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారని వివరించారు. హోం ఓటింగ్ ప్రక్రియ ఆదివారంతో ముగుస్తుందని, ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా 28 వరకు వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. ఇతర జిల్లాల నియోజకవర్గాల్లోని పోస్టల్ బ్యాలెట్లను కలెక్టరేట్‌లోని ఫెసిలిటేషియన్ సెంటర్‌లో నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట నియోజకవర్గాల ఓటర్లు కలెక్టరేట్‌తోపాటు ఆయా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లోనూ పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవచ్చని చెప్పారు.



నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో పోస్టల్ బ్యాలెన్ వినియోగించుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగులు

రూ.2.90 కోట్ల మద్యం పట్టివేత

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మద్యం అక్రమ రవాణా, గంజాయి తరలింపు, గుడుంబా తయారీ, తరలింపు, విక్రయాలపై పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని కలెక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని నాగర్ కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట నియోజకవర్గాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, జిల్లా ఎక్సైజ్ శాఖ, పోలీసులు సమన్వయంతో ఇప్పటి వరకు రూ.2.90 కోట్ల విలువ చేసే మద్యం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. శుక్రవారం అర్ధరాత్రి నాగర్‌కర్నూల్‌లో ఎన్నికల నిబంధనలు అతిక్రమించి మద్యం తరలించిన మోతీ వైన్ షాపును సీజ్ చేయాలని, అక్రమంగా తరలించిన మద్యాన్ని రికవరీ చేయాలని ఆదేశించామన్నారు. స్టాక్ రిజిస్టర్ నిర్వహణ, బిల్లు పుస్తకాలు వినియోగించని షాపుల యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. అక్రమ మద్యాన్ని అరికట్టేందుకు ప్రజలు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూం నం.9391151946కు సమాచారం అందించాలని కోరారు.

పల్లెల్లో పదనిసలు

- ఇటు వ్యవసాయ పనులు.. అటు ఎన్నికల ప్రచారం
- జోరుగా సాగుతున్న ఆయా కార్యక్రమాలు
- ఉదయం.. రాత్రి సమయాల్లో కలుస్తూ ఓట్ల అభ్యర్థన
- గ్రామాల్లో మధ్యాహ్నం వేళ నిశబ్ద వాతావరణం
- బహిరంగ సభలకు జనసమీకరణ చేయలేక పాట్లు



అచ్చంపేట: అసలే వ్యవసాయంలో కీలకమైన కాలం.. చేతికొచ్చిన పత్తి తీత, వరి కోత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ తరుణంలోనే ఎన్నికలు రావడంతో వ్యవసాయ పనులు ప్రచారానికి పెద్ద అడ్డంకిగా మారాయి. నాయకులు, ప్రజాప్రతినిధులు, అభ్యర్థులు ప్రచారానికి వెళ్లిన గ్రామాల్లో ఒక్కరు కూడా కనబడటం లేదు. గత మూడు వారాల నుంచి నేతల విస్తృతంగా ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇదే సమయంలో పత్తితీయడం, వరికోతలు వంటి పనుల్లో వ్యవసాయదారులు, కూలీలు నిమగ్నమై ఉంటున్నారు. ఫలితంగా మధ్యాహ్నం గ్రామాల్లో నిశబ్ద వాతావరణం కనిపిస్తోంది. నేతలు తమ ప్రచారాన్ని ఉదయం పది గంటలకు ముందు, సాయంత్రం నాలుగు గంటల తర్వాత కొనసాగించే పరిస్థితి నెలకొంది. మొత్తంగా పల్లెల్లో విభిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు.

తెల్లవారక ముందే..

ప్రస్తుతం గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు జన సమీకరణ కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. కొంతమంది నాయకులు వ్యవసాయ భూముల్లో పనులు చేసుకుంటున్న రైతులు, కూలీలను పొలాల వద్దకు వెళ్లి ప్రసన్నం చేసుకుంటున్నారు. జర మాకు ఓటేయండి.. మీకు అండగా ఉంటామని విన్నవిస్తున్నారు. కొంతమంది వ్యవసాయ పనుల్లో చేదోడు వాదోడుగా కొద్దిసేపు పనులు చేస్తూ మరీ మెప్పించడం విశేషం. ఇక కొంతమంది ప్రజాప్రతినిధులు తెల్లవారక ముందే ఓటరును ప్రసన్నం చేసుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. జిల్లాలో గ్రామీణ జనాభే అధికం. ప్రధాన వృత్తి వ్యవసాయం. తమ నాయకుడు వచ్చి ప్రచారం చేసే సమయంలో ప్రజలు పలుచగా ఉంటే మొదటికే మోసం వస్తుందని ద్వితీయ శ్రేణి నాయకులు వాపోతున్నారు. జనాలు తక్కువ కాకుండా ఇతర ప్రాంతాల నుంచి తీసుకురావడమో.. తమ గ్రామాల వారికే డబ్బులు ఇవ్వడం వారే ఏదో విధంగా ఉండే ప్రయత్నాలు చేస్తున్నారు. నేతల ప్రచారానికి వచ్చే రోజు ఎలాగైనా ప్రజలు ఉండేలా చూసుకుంటున్నారు. గ్రామాల్లో కూలీలు లేకపోతే వ్యవసాయ పనులు కష్టం కాబట్టి ముఖ్యంగా వీరు పనులకు వెళ్లకుంటే దాదాపుగా గ్రామాల్లోని ప్రజలందరూ వెళ్లరని భావిస్తున్నారు. దీంతో ఈ రోజు తమ గ్రామంలో ప్రచారం ఉందంటే గ్రామాల్లోని నాయకులు ప్రజలు ఉండేలా ప్రణాళిక వేసుకుంటున్నారు. ముందురోజు కూలీలకు కూలీ డబ్బులు ఇవ్వడంతోపాటు భోజనం, మద్యం సరఫరా చేస్తున్నా రు. మరోవైపు అత్యవసరమైతే కూలీలు రాకున్నా ఇంటిల్లిపాది వ్యవసాయ పనులకు వెళ్తున్నారు.

బీసీల ఐక్యత చాటుదాం



సంఘీభావం ప్రకటిస్తున్న బీసీ నాయకులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఆచారి తదితరులు

కల్వకుర్తి రూరల్: సమాజంలో 60 శాతం జనాభా కలిగిన బలహీన వర్గాల ప్రజలు ఐక్యత చాటి ఏకమవుదామని, పోటీలో ఉన్న బలహీన వర్గాల అభ్యర్థులను గెలిపించుకుందామని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం కల్వకుర్తిలో నిర్వహించిన బీసీ కులాల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ బీసీని ముఖ్యమంత్రి చేస్తానని హామీ ఇచ్చిందని దాని ప్రకారం బీసీలంతా కల్వకుర్తిలో ఆ పార్టీ అభ్యర్థి ఆచారికి అండగా నిలవాలన్నారు. ఎన్నో ఏళ్లుగా రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలను చైతన్యం చేసే కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఐదుసార్లు బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయినప్పటికీ పార్టీ మారకుండా కార్యకర్తలకు అండగా ఉంటూ ఆరోసారి పోటీ చేస్తున్న ఆచారిని బీసీ కులాలు ఆశీర్వదించాలన్నారు. ఆచారి విజయం ద్వారా బడుగుల సత్తా చాటిచెప్పాలని శ్రీనివాస్‌గౌడ్ కోరారు. అనంతరం ఆచారి మాట్లాడుతూ ఈసారి బీసీలతోపాటు ఎస్సీలలో మాదిగలు బీజేపీకి మద్దతుగా నిలవడంతో విజయం ఖాయమన్నారు. సమావేశంలో రాజేందర్, వివిధ కులాల నాయకులు పాల్గొన్నారు.

నేడు ప్రముఖుల పర్యటన

- మహబూబ్‌నగర్ బహిరంగసభకు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్
- మక్తల్‌లో అమిత్‌షా బహిరంగసభ, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య రోడ్‌షో
- పాలమూరు, నారాయణపేట, దేవరకద్రలో రేవంత్ ప్రచారం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ముగుస్తున్న నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు బడా నేతలతో ప్రచారాన్ని నిర్వహించనున్నాయి. ఆదివారం ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పర్యటించనున్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాలలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న బహిరంగ సభలో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ పాల్గొననున్నారు. అలాగే మధ్యాహ్నం ఒంటిగంటకు గడియారం చౌరస్తా వద్ద నిర్వహించే కాంగ్రెస్ బహిరంగ సభకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే బీజేపీ విజయ సంకల్ప సభలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పాల్గొని ప్రసంగించనున్నారు. మక్తల్‌లోనే మధ్యాహ్నం 3 గంటలకు కాంగ్రెస్ నిర్వహించే రోడ్‌షోకు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య హాజరవుతారు. అలాగే మహబూబ్‌నగర్‌తో పాటు నారాయణపేట, దేవరకద్ర నియోజకవర్గాల్లోని కాంగ్రెస్ బహిరంగ సభలకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ హాజరుకానున్నారు. సోమవారం కోస్గిలో కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ బహిరంగసభలో పాల్గొంటారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అగ్రనేతలు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రుల సభలతో ఎన్నికల ప్రచారం హోరెత్తనుంది.

కాంగ్రెస్‌లో చేరిన తెలకపల్లి ఎంపీపీ

కందనూలు/తెలకపల్లి: బీఆర్‌ఎస్ తెలకపల్లి ఎంపీపీ కొమ్ము మధు శనివారం ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్సీ నివాసంలో పార్టీ కండావ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మధు విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి వ్యవహార శైలితో ఎన్నో అవమానాలు పడ్డానని, ఎమ్మెల్యే పర్యటన, అధికారిక కార్యక్రమాలకు సంబంధించి కనీస సమాచారం ఇవ్వలేదని ఆరోపించారు. మండలంలో ఏ పదవి లేని వ్యక్తి చెప్పిందే మేం వినాల్సి వచ్చేదని, అధికారులకు సైతం అతను చెప్పిందే ఫైనల్ అని ఆరోపించారు. ఎమ్మెల్యే నియంతృత్వానికి ముందుగా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ పద్మావతి బలైందని, ఆమెకు రాజకీయ భవిష్యత్ లేకుండా చేశారని వాపోయారు. ఆత్మగౌరవాన్ని చంపుకొని పార్టీలో ఉండలేమని అందుకే కాంగ్రెస్‌లో చేరానని పేర్కొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రాజేష్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తానని చెప్పారు.



ఎంపీపీ మధుకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కూచకుళ్ల దామోదర్‌రెడ్డి

ఉక్కిరిబిక్కిరి

- బందోబస్తులో పోలీసుల బిజీబిజీ
- చెక్‌పోస్టులలో కొనసాగుతున్న నిరంతర తనిఖీలు
- షాడో పార్టీలతో అభ్యర్థుల కదలికలపై ప్రత్యేక దృష్టి
- బహిరంగ సభలు, కీలక నేతల రాకతో టెన్షన్
- పోలింగ్ దగ్గర పడటంతో ఉత్కంఠ



నాగర్‌కర్నూల్ క్రైం: పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న కొద్ది రాజకీయ వేడి పెరుగుతోంది. అభ్యర్థులు వారి అనుచర గణం ప్రచారంలో దూసుకుపోతున్నారు. పలుచోట్ల ఘర్షణలు, ఆరోపణలు, ప్రత్యారోపణలతో పరిస్థితి ఉద్రిక్తతంగా మారుతోంది. అయితే ఇప్పటిదాకా సమర్థవంతంగా శాంతిభద్రతల పరిరక్షణలో విజయం సాధించగలిగిన పోలీసులు చివరి క్షణంలో ఏర్పడే రాజకీయ ఉద్రిక్తలను అదుపు చేసే అంశంపై దృష్టిసారించారు. రౌడీషీటర్లు, బైండోవర్లు, రాజకీయ వివాదాలకు కారణమవుతు వస్తున్న గ్రామాలపై ప్రత్యేక దృష్టితోపాటు నిఘా వర్గాల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నారు. ఇటీవల అచ్చంపేటలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య జరిగిన ఘర్షణతోపాటు కొల్లాపూర్ స్వతంత్ర అభ్యర్థి శిరీష అలియాస్ బర్రెలక్క కుటుంబ సభ్యులపై జరిగిన దాడులకు సంబంధించి ఫిర్యాదులు రావడంతో కేసులు నమోదు చేశారు. ముమ్ముందు రాజకీయ ఘర్షణలు పెరిగే ఆస్కారం ఎక్కువగా ఉండటంతో ముందు నుంచే శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

ముఖ్య నాయకుల తాకిడి

ఎన్నికల ప్రచారం చివరి అంకానికి చేరడంతో ముఖ్య, జాతీయ నాయకుల తాకిడి కూడా ఎక్కువ కావడంతో వారి బందోబస్తులో పోలీసులు నిరంతరంగా శ్రమిస్తున్నారు. ఇప్పటికే సీఎం కేసీఆర్, కేంద్ర మంత్రులు అమిత్‌షా, నితిన్ గడ్కరీ, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ బహిరంగ సభల తోపాటు ఆయా రాజకీయ పార్టీల రోడ్‌షోలకు సంబంధించి బందోబస్తులో పోలీసులు తీరిక లేకుండా గడుపుతున్నారు.

అభ్యర్థుల వెంట షాడో పార్టీలు

ఎన్నికల నేపథ్యంలో పోలీసులు ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థుల ప్రతి కదలికలను షాడో పార్టీలు గమనిస్తూ ఉన్నాయి. నేర చరితులు, సమస్యాత్మక ప్రాంతాల్లో వ్యక్తులు గొడవలు సృష్టించే ప్రమాదం ఉన్నందున పోలీసులు ప్రత్యేకంగా షాడో పార్టీలను ఏర్పాటు చేసి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా వారిపై ప్రత్యేక నిఘా పెట్టారు. నేర చరిత్ర కలిగిన వారు ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసే అవకాశం ఉన్నందున వారు ఎక్కడికి వెళ్తున్నారు.. ఎవరెవరిని కలుస్తున్నారనే విషయాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. అలాగే ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థి వెంట ఒక షాడో పార్టీని ఏర్పాటు చేశారు. అభ్యర్థుల ప్రతి కదలికలను గమనిస్తూ.. సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేస్తున్నారు.

ఎన్నికల సిత్రాలు..

ఓట్ల పంట పండాలి..



వనపర్తి బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి నిరంజన్‌రెడ్డి పెద్దమందడి సమీపంలో పత్తి తీస్తున్న కూలీలను కలిసి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. - వనపర్తి

చాయ్.. ఓటు వేసెయ్..



మహబూబ్‌నగర్‌లోని ఓ టిఫిన్ సెంటర్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అందరికీ స్వయంగా టీ అందిస్తూ ఓట్లను అభ్యర్థించారు. - మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ

వీరతిలకం.. తిరుగులేదిక..



జడ్చర్ల సెగ్మెంట్‌లోని నవాబుపేట మండలం కొల్లూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి అనిరుధ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించగా, మహిళలు బొట్టు పెట్టి హారతులు పట్టారు. - నవాబుపేట

అందరూ ఓటెయ్యాలే రామక్క..



కొల్లాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పాన్‌గల్ మండలం శాగాపూర్‌లో గ్రామస్తులతో కలిసి రామక్క పాటకు ఆడిపాడారు. - కొల్లాపూర్

వరికోత.. ఓటు పడుతా..



హన్వాడ మండలం దాచకపల్లిలో మహబూబ్‌నగర్ బీజేపీ అభ్యర్థి మిథున్‌రెడ్డి వరికోత యంత్రం నడిపి అందరినీ ఆకట్టుకున్నారు. - పాలమూరు

చిన్నారుల కోలాటం.. అభ్యర్థి సంబరం



ఆత్మకూర్ మండలం కత్తేపల్లికి మక్తల్ బీజేపీ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి ఎన్నికల ప్రచారానికి వెళ్లగా.. చిన్నారులు కోలాటం వేసి స్వాగతం పలికారు. - ఆత్మకూర్

కాక.. 'చే'జారకే



మక్తల్ సెగ్మెంట్‌లోని అమరచింత మండలం నందిమళ్లలో కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి తరఫున టీపీసీసీ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజ్‌గౌడ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. -అమరచింత

గెలిస్తే అభయ హస్తమే..



నారాయణపేటలో కాంగ్రెస్ అభ్యర్థి చిట్టెం పర్ణికారెడ్డి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. - నారాయణపేట



నీ కోసం జీవిస్తే నీలోనే ఉండిపోతావు.. అదే జనం కోసం జీవిస్తే జనంలో నిలిచిపోతావు.
- డా. బీఆర్ అంబేడ్కర్

ఓటు వేయమని బలవంతపెట్టొద్దు



ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ఓటు వేయమని ఎవరిని బలవంతపెట్టకూడదు. ఈ మేరకు ఎన్నికల సంఘం పలు సూచనలు ఇచ్చింది. ఓటు వేయదలచుకోలేని ఓటరు వివరాలను ప్రిసైడింగ్ అధికారి సేకరించాల్సి ఉంటుంది. సదరు ఓటరు 'ఓటు వేయడానికి తిరస్కరించారు' అని ఓటరు రిజస్టర్‌లో రిమార్క్ రాసి ప్రిసైడింగ్ అధికారి చేయాలి. ఫారం–17సీ పార్ట్–1లో నియమం 49–0 కింద ఐటమ్–3లో 'ఓటు వేయకుండా వెళ్లిపోయారు లేదా ఓటు వేయడానికి తిరస్కరించారు' అని చేర్చాలి. అలాగే ఈవీఎంలో సీయూ బటన్ నొక్కి తర్వాతి ఓటరు ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలి. - అచ్చంపేట

జంగ్ తెలంగాణ

కుటుంబ పాలనకు చరమగీతం పాడాలి



పాలమూరులో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్ చుగ్

- ఎంఐఎం, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటే..
- బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్

పాలమూరు/దేవరకద్ర: తెలంగాణలో కుటుంబ పాలనకు చరమగీతం పాడాలని బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్ చుగ్ అన్నారు. మహబూబ్‌నగర్, దేవరకద్ర పట్టణాల్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు ఒక్కటే అని, కుటుంబ పాలనతో దోచుకుతింటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో ఎంతో అవినీతి జరిగిందని, మంత్రులు జైలుకు వెళ్లినట్లు తెలిపారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పీఎంఓ నుంచి కాకుండా 10 జన్‌పథ్ నుంచి నడిచిందన్నారు. తెలంగాణలో కూడా సీఎంఓ నుంచి పాలన జరగడం లేదని, కేవలం ఫాంహౌస్ నుంచి కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం అన్ని వర్గాల ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తేనే అభివృద్ధి వేగవంతమవుతుందన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఓబీసీ ముఖ్యమంత్రిని ఏర్పాటు చేసి బంగారు తెలంగాణ నిర్మిస్తామన్నారు. తొమ్మిదేళ్లలో తెలంగాణకు కేంద్రం నుంచి భారీగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈనెల 30న ప్రజలు ఓటు ద్వారా అహంకార, అవినీతిపరులకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాగా అవినీతిపరులపై మీ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఓ విలేకరి ప్రశ్నించగా.. తరుణ్ చుగ్ సమాధానమిస్తూ చట్టం తన పని తాను చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డి, పద్మజారెడ్డి, జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి, డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, నంగి దేవేందర్‌రెడ్డి, కేఎల్‌ఎన్ రాజు, నారాయణరెడ్డి, రమేష్ ఉన్నారు.

■ మహబూబ్‌నగర్‌లోని బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించనున్న సకలజనుల విజయసంకల్ప సభకు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ హాజరవుతున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి తెలిపారు. పట్టణంలోని ఏపీ జితేందర్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలుర కళాశాల మైదానంలో 11నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించే సభలో యోగి ఆదిత్యనాథ్ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. అదేవిధంగా ఈనెల 27న పాలమూరులో నిర్వహించే కార్నర్ మీటింగ్‌కు బీజేపీ నేత, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ హాజరవుతున్నట్లు తెలిపారు.

పీయూలో ఖోఖో జట్ల ఎంపికలు



పీయూలో ఖోఖో పోటీల్లో ఎంపికైన విద్యార్థులతో పీడీలు తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఆల్‌ఇండియా సౌత్‌జోన్ పోటీలకు ఖోఖో జట్ల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు పవన్‌కుమార్ విద్యార్థులను పరిచయం చేసుకుని ఎంపికలు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు యూనివర్సిటీ స్థాయిలో వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని, పూర్తిస్థాయి ప్రతిభ కనబర్చి పేరు తీసుకురావాలన్నారు. బాలికల జట్లలో 15, బాలుర జట్లలో 18 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాస్, పీడీ సత్యభాస్కర్, బాల్‌రాజ్, విలియమ్స్, మౌలాలి, వెంకటేష్, రమేష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టోర్నీలో విజేతగా నిలవాలి



నెట్‌బాల్ క్రీడాకారులతో ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లు విజేతగా నిలవాలని తెలంగాణ నెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు విక్రం ఆదిత్యరెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా స్థాయి అండర్–14, అండర్–17 బాలబాలికల నెట్‌బాల్ జట్లను ఎంపిక చేశారు. ఎంపికలకు దాదాపు 100మందికిపైగా క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో నిరంతర సాధన ద్వారా ఉన్నత క్రీడాకారుడిగా ఎదగవచ్చని అన్నారు. క్రీడాకారులు నెట్‌బాల్ క్రీడల్లో ప్రతిభ చాటాలని సూచించారు. అనంతరం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర నెట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడు సాదత్‌ఖాన్, వ్యాయామ ఉపాధ్యాయులు రాంమోహన్, సోహైల్ ఉర్ రహిమాన్, జ్యోతి, స్వప్న, ముంతాజ్, రాణి, శివాణి, పర్వీన్‌బేగం పాల్గొన్నారు.

ముగిసిన ఉమ్మడి జిల్లా పాలిటెక్నిక్ క్రీడా పోటీలు

ఓవరాల్ చాంపియన్ మహబూబ్‌నగర్, పెబ్బేరు



పరుగు పోటీలో పాల్గొన్న బాలికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న ఉమ్మడి జిల్లా పాలిటెక్నిక్ క్రీడాపోటీలు శనివారం ముగిశాయి. ఈ క్రీడాపోటీల్లో బాలుర విభాగంలో మహబూబ్‌నగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, బాలికల విభాగంలో పెబ్బేరు కళాశాలలు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించాయి. అథ్లెటిక్స్ వ్యక్తిగత విభాగం బాలురలో కె.శశాంక్(మహబూబ్‌నగర్), బాలికల్లో మౌనిక(పెబ్బేరు) ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. అదేవిధంగా షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో నందిని, పూజిత(పెబ్బేర్), భార్గవి, గౌరిప్రియ(వనపర్తి), హైజంప్‌లో శశాంక్ (మహబూబ్‌నగర్), శ్రీనివాస్(కోస్గి) విన్నర్, రన్నర్‌లుగా నిలిచారు. గెలుపొందిన విన్నర్, రన్నరప్ జట్లకు ప్రిన్సిపాల్ పి.నాగరాజు ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల శాఖాధిపతులు అరుణ, శశిభూషణ్‌గౌడ్, జగదీష్‌కుమార్, సుజాతారాణి, రాజేశ్వరి, అనంతరెడ్డి, పీడీ శ్రీకాంత్, ఆయా కళాశాలల అధ్యాపకులు, పీడీలు తదితరులు పాల్గొన్నారు.

గుట్టుగా మద్యం తరలింపు

నాగర్‌కర్నూల్ మోతి వైన్స్ సీజ్



నాగర్‌కర్నూల్ మోతివైన్స్ నుంచి మద్యం తరలిస్తున్న జీపులు, ఆటోలు

నాగర్‌కర్నూల్ క్రైం: ఎన్నికల వేళ ఓ వైన్స్ నుంచి మద్యాన్ని అక్రమంగా గ్రామాలకు తరలించిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నాగర్‌కర్నూల్‌కు చెందిన కౌన్సిలర్ శకుంతలబాయికి సంబంధించిన మోతి వైన్స్ నుంచి శుక్రవారం అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా జీపులు, ఆటోల్లో మద్యం తరలింపు చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకునేలోగా వైన్స్ నుంచి మద్యాన్ని తరలించారు. మద్యం తరలింపునకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పాటు ఎన్నికల అబ్జర్వర్‌కు ఫిర్యాదులు అందాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం మద్యం దుకాణాన్ని ఎక్సైజ్ అధికారులు సీజ్ చేశారు. ఈ విషయంపై ఎక్సైజ్ సీఐ ఏడుకొండలును వివరణ కోరగా.. మోతివైన్స్ నుంచి దాదాపు రూ 10లక్షల విలువగల మద్యాన్ని అక్రమంగా తరలించినట్లు గుర్తించినట్లు తెలిపారు. మద్యం రికవరీకి రెండు టీంలను ఏర్పాటు చేశామన్నారు. మద్యం అక్రమంగా తరలించినందుకు శకుంతలబాయితో పాటు మరొకరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం, నగదు తరలింపునకు అడ్డుకట్ట వేసేందుకు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పూర్తిగా తగ్గింది. శనివారం రాత్రి 7గంటల వరకు కేవలం 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైనట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆవిరి రూపంలో 110, కోయిల్‌సాగర్‌కు 315, ఎడమ కాల్వకు 390, కుడి కాల్వకు 361 క్యూసెక్కులతో కలిపి ప్రాజెక్టు నుంచి 1,176 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 7.627 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు.

కురుమూర్తి వాస.. గోవిందా



కురుమూర్తి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

చిన్నచింతకుంట: పాలమూరు ప్రజల ఆరాధ్యదైవమైన కురుమూర్తి స్వామి జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. రోజువారి కార్యక్రమాలను ఆలయ వేదపండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కోనేరులో స్నానాలు చేసిన భక్తులు తడి దుస్తులతో స్వామివారిని దర్శించుకున్నారు. పద్మావతిదేవి ఆలయం, ఉద్దాల మండపం, ఆంజనేయ స్వామి, ఆలయాల వద్ద భక్తులు పూజలు చేశారు. జాతర మైదానంలో దాసంగాలు పెట్టి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. తీపి వంటకాలు చేసి పచ్చిపులుసు పరమాన్నంతో స్వామివారికి నైవేద్యం సమర్పించారు. కల్యాణ కట్ట వద్ద భక్తులు తలనీలాలు సమర్పించారు. జాతరకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు వైద్యసిబ్బందితో వైద్యసేవలు అందిస్తున్నారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించి రాత్రి వేళలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గస్తీ నిర్వహిస్తున్నారు.



క్యూకట్టిన భక్తులు

మరమ్మతులకు నోచుకోని స్నానపు గదులు..

జాతర ప్రాంగణంలోని కోనేరు సమీపంలో స్నానపు గదులకు తలుపులు ఊడిపోయాయి. వాటిని అధికారులు మరమ్మతులు చేపట్టలేదు. దీంతో స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులు కోనేరులో స్నానాలు ఆచరించి దుస్తులు మార్చుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్రహ్మోత్సవాలకు ముందు అధికారులు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ముఖ్యంగా మహిళ భక్తులకు స్నానపుగదులు, మరుగుదొడ్లు, ప్రత్యేక మూత్రశాలలు ఏర్పాటు చేయాలని సమీక్ష సమావేశాలు నిర్వహించారు. నేడు భక్తుల ఏర్పాట్లపై నిర్లక్ష్యం వహించి సరైన ఏర్పాట్లు చేయలేదని పలువురు భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కోనేరు వద్ద ఉన్న స్నానపు గదులకు మరమ్మతులు చేపట్టి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

రూ.7లక్షల నగదు సీజ్



పట్టుబడిన నగదుతో పోలీసులు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం వెల్టూర్ సమీపంలోని చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఎస్ టీం ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో కొత్తకోట మండలం పాలెం గ్రామానికి చెందిన చాపల శ్రీనివాస్‌రెడ్డి కారును తనిఖీ చేసేందుకు ప్రయత్నించగా.. అతడు పోలీసులను గమనించి వేగంగా ముందుకెళ్లాడు. దీంతో పోలీసులు కారును వెంబడించి పట్టుకున్నారు. కారులో రూ.7లక్షల నగదును గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు ఎస్‌ఎస్ టీం అధికారి కృష్ణ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అచ్చంపేట రూరల్: మానసిక స్థితి సరిగ్గా లేని వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం అచ్చంపేట శివారులో చోటు చేసుకుంది. అచ్చంపేట ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బల్మూర్ మండలం కొండనాగులకి చెందిన లెంకల శ్రీను(48) శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. అచ్చంపేట శివారులోని ఓ రైతుకు చెందిన వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకుని మృతిచెందాడు. శనివారం ఉదయం పొలానికి వెళ్లిన రైతు గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు సంఘటనా స్థలికి వెళ్లి కుటుంబ సభ్యులకు విషయం చెప్పారు. మృతుడికి భార్య యాదమ్మతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

యూత్ కాంగ్రెస్ కార్యకర్తపై దాడి



చికిత్స పొందుతున్న హనుమంతు

అమ్రాబాద్: నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం చిట్లంకుంటలో శుక్రవారం రాత్రి యూత్ కాంగ్రెస్ కార్యకర్తపై గుర్తుతెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. చెన్నంపల్లికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు హనుమంతు బైక్‌పై పదర నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా, చిట్లంకుంట గ్రామ సమీపంలో గుర్తుతెలియని యువకులు అడ్డగించి దాడి చేశారు. దాడిలో హనుమంతుకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తిరుపతిరెడ్డి తెలిపారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ అభ్యర్థి డా. వంశీకృష్ణ, జెడ్పీటీసీ అనురాధ, అమ్రాబాద్ ఎంపీపీ శ్రీనివాసులు అచ్చంపేట ఆస్పత్రికి చేరుకొని హనుమంతును పరామర్శించారు. చిట్లంకుంటకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులే అతడిపై దాడికి పాల్పడ్డారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు.